క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి ఐక్యతతో కృషి చేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి పార్టీ శ్రేణులు ఐక్యతతో కృషి చేయాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని 17వ వార్డులో వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డు పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుకొని కార్యకర్తల, నుంచి సూచనలు తీసుకొని పార్టీని పటిష్టపరుచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్, నాయకులు జి.సత్యనారాయణ, మెకానిక్ బీరప్ప, బి.సత్యనారాయణ, పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ హేమంత్‌కుమార్

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని పద్మశాలి భక్త మార్కండేయ స్వామి ఆలయ కల్యాణ మండపంలో ఎమ్మిగనూరు ఆర్‌కే కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటలకు కంటి వైద్య నిపుణులు డాక్టర్ హేమంత్ కుమార్ వైద్య పరీక్షలు చేశాడు. గ్రామంలో 155 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కంటి శుక్లము, పొర ఏర్పడిన వారికి ఆపరేషన్ నిమిత్తం 50 మంది దాకా రెఫర్ చేశారు. వైద్య శిబిరానికి కోసిగి సీఐ మంజునాథ్ సందర్శించారు.

వీర జవాన్లకు ఘన నివాళి



జవాన్లకు నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పుల్వామా ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వీర జవాన్లకు శుక్రవారం స్థానిక బీసీ హాస్టల్ ఆవరణలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ సంఘ నాయకుడు మారుతి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన వీరజవాన్లను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జవాన్లకు దేశ ప్రజలు రుణపడి వుండాలన్నారు.

కరణికి బస్సు సౌకర్యం



బస్సును ప్రారంభిస్తున్న సర్పంచ్

కౌతాళం: మండల పరిధిలోని కరణి గ్రామానికి విద్యార్థుల కోసం, గ్రామస్తుల కోసం ఆదోని డిపో వారు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును శుక్రవారం గ్రామ సర్పంచ్ పుష్పలత, గ్రామ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గోవిందులు గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తమ గ్రామం నుంచి వందగల్లు జెడ్పీ పాఠశాలకు వెళ్లడానికి, అలాగే కోసిగిలోని కళాశాలలో చదువుకోవడానికి విద్యార్థులకు చాల కష్టంగా ఉండేదన్నారు. గ్రామస్తులకు కూడా ఎలాంటి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆర్టీసీ డిపో అధికారులకు తమ కష్టాలను తెలియజేయడంతో స్పందించి కరణి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించారని తెలిపారు.

భవసాగరాన్ని దాటించేది భగవన్నామస్మరణ



ప్రవచనాలు వివరిస్తున్న డాక్టర్ మల్లు వెంకటరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: భవసాగరాన్ని దాటించేది భగవన్నామస్మరణమే అని టీటీడీ దేవస్థానముల హిందూ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. పట్టణంలోని మిలటరీ కాలనీలో శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం ధార్మిక సంస్థల ప్రతినిధులు శ్రీమద్రాయణం, మహాభారతం, భగవద్గీత, గీత ప్రచారకులు నాగరాజు స్వామి ధార్మిక ప్రవచనాలు వినిపించారు. అనంతరం గోపూజ, కుంకుమార్చన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మీసాల బండ నీలకంఠ, సభ్యులు గోవిందు, రామన్న, ఆలయ అర్చకులు గోపాల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల ప్రాంగణం

- శిథిలావస్థలో కోసిగి ఆర్టీసీ బస్టాండ్
- సరైన సౌకర్యాలులేక ప్రాయాణికుల అవస్థలు
- వేచి వుండేందుకు కుర్చీలు కరువు
- బస్టాండ్‌లో వెలగని లైట్లు

కోసిగి: ప్రయాణికుల సౌకర్యార్థం కోసిగిలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. దాదాపు 40 ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్ ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ, మరమ్మతులకు నోచుకోకపోవడంతో అధ్వానంగా తయారైంది. బస్టాండ్‌లో ప్రయాణికులకు సరైన సౌకర్యాలు కరువయ్యాయి. బస్టాండ్ ద్వారా ఆర్టీసీకి ఆదాయం బాగానే వస్తున్నా వసతులు మాత్రం కల్పించడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిత్యం రద్దీగా..

కోసిగి మండలంలోని 26 గ్రామాల నుంచే కాక మంత్రాలయం, పెద్దకడబూరు, కౌతాళం మండలాలలో పలు గ్రామాల ప్రజలు కోసిగి మీదుగా ఇతర ప్రాంతాలు వెళ్తుంటారు. ప్రయాణికులతో రోజు బస్టాండ్ రద్దీగా ఉంటుంది. కొన్ని సార్లు బస్సుల రాక కోసం గంటల కొద్ది వేచి ఉండాల్సి వస్తోంది. ప్రయాణికులకు వేచి ఉండేందుకు కనీసం కుర్చీలు కూడ లేక పోవడంతో నిలబడే ఉండాల్సి వస్తోంది.

పెచ్చులూడుతున్న పైకప్పు

ఆర్టీసీ బస్టాండ్ పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. గతేడాది వర్షకాలంలో అకస్మాత్తుగా పైకప్పు సిమెంట్ రాలి కిందకు పడిపోయింది. ఆ సమయంలో ప్రయాణికులు లేక పోవడంతో ప్రమాదం తప్పింది.



పై కప్పు పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకున్న ఆర్టీసీ బస్టాండ్



రాత్రి బస్టాండ్ ప్రాంగణంలో చీకటిగా ఉన్న దృశ్యం

ఆదాయం ఉన్నా సౌకర్యాలు నిల్

కోసిగి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో 32 దుకాణాలు ఆర్టీసీ అధికారులు టెండర్ల ద్వారా కేటాయించారు. ఏటా లక్షలాది రూపాయాలు ఆదాయం సమకూరుతున్న బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించలేక పోతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రిల్లో బస్టాండ్ ప్రాంగణంలో కనీసం లైట్లు కూడా వెలగక అంధకారంలో ఉంటోంది. రాత్రి ఆఖరి బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు చీకటి ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సాయంత్రం కాకముందే మరుగుదొడ్లుకు తాళాలు వేస్తుడటంతో బస్టాండు ప్రాంతం బహిర్భూమిగా మారుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతూ కంపుకొడుతోంది. పలు మార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వ్యాపారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గ కేంద్రానికి బస్సులు లేవు..

మండల కేంద్రం కోసిగి మీదుగా ఆదోని, ఎమ్మిగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం, నియోజకవర్గ కేంద్రం మంత్రాలయానికి బస్సు సర్వీసును నడపాలని ప్రయాణికులు కోరారు. అలాగే నియోజవర్గ కేంద్రం పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రం రాయచూరు పట్టణానికి అత్యధికంగా ప్రజలు వ్యాపార నిమిత్తం, వివిధ పనులు నిమిత్తం వెళ్తుంటారు. గతంలో ఆయా ప్రాంతాలకు బస్సులు నడుతుండేవారు. ప్రస్తుతం ఆ సర్వీసులు రద్దు చేయడంలో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాలకు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని, బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలి



కోసిగి ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేవు. రాత్రిల్లో బస్టాండ్‌లో లైటు వెలగడం లేదు. బస్టాండ్‌లో కూర్చునేందుకు కుర్చీలు కూడా లేవు. దీంతో బస్సుల రాక కోసం నిలబడి వేచి ఉండాల్సి వస్తోంది. అధికారులు స్పందించి బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలి. – హనుమంతు, భూంపల్లి

బస్సులు పునరుద్ధరించాలి



మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంలో వివిధ పనులు నిమిత్తం ప్రజలు వెళ్లాలి వస్తుంది. కోసిగి నుంచి బస్సులు లేక పోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. రాయచూరు పట్టణానికి గతంలో బస్సు సౌకర్యం ఉండేది. తద్వారా మంత్రాలయం, రాయచూరు పట్టణాలకు బస్సు సర్వీసులను యథావిధిగా కొనసాగించాలి. – రాముడు కోసిగి

ప్రతిపాదనలు పంపాం



కోసిగి బస్టాండ్ పెచ్చులూడి శిథిలావస్థకు చేరింది. ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు నివేదిక పంపాం. బస్టాండ్ ప్రాంగణంలో వీధిలైట్లు, మైనర్ రిపేరిలు చేయిస్తాం. ప్రయాణికులు కూర్చునేందుకు మధ్య ఇటుకలతో బెంచీలు కట్టించేందుకు చర్యలు తీసుకుంటాం. బస్టాండ్ ప్రాంగణంలో ఆటోలు నిలుపరాదు. బస్సులకు రాకపోకలకు ఇబ్బందులకు లేకుండా వాహనదారులు సహకరించాలి. – మహ్మద్ రఫీక్, డీఎం, ఆదోని

రాంజల నల్లచెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

ఆదోని టౌన్: పట్టణానికి తాగునీటిని అందించే రాంజల నల్ల చెరువును శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. రాంజల చెరువులో నీటి నిల్వ, రోజు వారీ పంపింగ్ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 27వ వార్డు పూలబజార్, ఎంఎం కాలనీ, మున్సిపల్ క్వార్టర్స్, 5వ వార్డు, రాంజల ట్యాంక్, పాత బస్టాండు సర్కిల్‌లోని అన్న క్యాంటీన్, నిర్మల్ టాకీస్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌లను పరిశీలించారు.

సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించండి

ఆదోని మున్సిపాలిటీ ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆస్తి, నీటి పన్ను కట్టడంలో ప్రజలు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దీంతో అభివృద్ధి కుంటు పడుతుందని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు.

హామీల అమలుకు నిధులు కేటాయించండి

ఆదోని సెంట్రల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రానున్న బడ్జెట్ సమావేశాల్లో నిధులను కేటాయించాలని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, జిల్లా అధ్యక్షుడు రమేష్ నాయుడు డిమాండ్ చేశారు. ఆర్‌ఆర్ లెబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ పట్టణ కార్యదర్శి భీమరాజు అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు మాసాలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు మాత్రం అమలు చేయడం లేదన్నారు. పీఆర్సీ అములు చేయడానికి ఇంకా సమయం పడుతుంది కనుక 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు గురురాజా, శ్రీరాములు, మధుసూదన్ రావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీడీఓ

కౌతాళం: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోగలరని ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. రైజింగ్ నాలెడ్జ్ అబాకస్ ఒలింపియాడ్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచి ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన ప్రతిభ హైస్కూల్ విద్యార్థులకు ఎంపీడీఓ జ్ఞాపికలు, మెడల్స్, ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఏదో ఒక నైపుణ్యం దాగి ఉంటుందని కాబట్టి ఉపాధ్యాయులు విద్యార్థుల నైపుణ్యాన్ని గ్రహించాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ దూద్ బాషా, హెచ్‌ఎం జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు జయలక్ష్మి, భీమేష్, శీను తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థులు వ్యవసాయ ఉత్పాదకతపై నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో సిజెంట ఫౌండేషన్ ఇండియా, జైపూర్ జాతీయ పరిశోధన మార్కెటింగ్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న నైపుణ్య ఆధారిత ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం, శిక్షణను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి ఈ శిక్షణకు డిప్లొమో అగ్రికల్చర్, హార్టికల్చర్ చదవిన 40 మంది విద్యార్థినీ, విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి నాలుగు వారాల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రుద్రగౌడ

కోసిగి: మండల కేంద్రంలో ఈనెల 17న జరుగబోయే రేణుకా ఎల్లమ్మ దేవి జాతర ఏర్పాట్లను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా చేపట్టాలని కోసిగి తహసీల్దార్ రుద్రగౌడ ఆదేశించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుమారి అయ్యమ్మ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ, పూజారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా జాతరలో భక్తులకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా మంచి నీటి సరఫరా చేపట్టాలన్నారు. ట్యాంకులకు పుష్కలంగా నీరు సరఫరాతో పాటు ప్రత్యేకంగా 10 ట్యాంకర్లుతో నీటిని అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు తెలిపారు. జాతరలో రాత్రిల్లో విద్యుత్ కోతలు ఏర్పడకుండా ముందస్తుగా అదనపు 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్ అంపయ్య తెలిపారు. అలాగే 150 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని ఏఎస్ఐ తిరుపాల్ నాయక్ వెల్లడించారు. జాతరలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయడంతో పాటు అత్యవసర నిమిత్తం కోసిగి హాస్పిటల్ వద్ద 108 వాహనం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు డాక్టర్ మనోజ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్, గ్రామ పెద్దలు మాణిక్యరాజు, ముత్తురెడ్డి, వక్రాని వెంకటేశ్వర్లు, కోసిగయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరం



మాట్లాడుతున్న నోడల్ అధికారి డాక్టర్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సోగనూరు రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో లింగనిర్ధారణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ చేయకూడదని ఆడ,మగ సమానమే అన్నారు. సమాజంలో స్త్రీల నిష్పత్తి తగ్గితే అనేక దుష్పరిణామాలు చోటు చేసుకునే అవకాశం వుందని తెలిపారు. గర్భస్థ శిశువును కాపాడాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు జాహ్నవి, హెచ్‌ఎం రఘు తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారు చేసుకోవాలి

నందవరం : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలలో వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసుకోవాలని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వానపాములతో ఎరువును తయారు చేసుకుని రైతులకు విక్రయించుకోవాలన్నారు. తద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని వివరించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో అలసత్వం

ఆదోని రూరల్: మండలంలోని పాండవగల్ గ్రామంలో బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్పంచ్ కె.ఉమాదేవి, గ్రామ సీపీఎం నాయకులు గోవిందు, పాండురంగ ఆరోపించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో బోరు వేశారన్నారు. ఆ తర్వాత గ్రామ పంచాయతీ నిధులతో రెండు సార్లు ఫ్లషింగ్ చేయడంతో పాటు మోటార్‌ను అమర్చడం జరిగిందన్నారు. రైతుల అనుమతితో కరెంట్ తీసుకుని నీటిని గ్రామానికి కొన్ని రోజులపాటు సరఫరా చేశామని చెప్పారు. అయితే ఎన్నిసార్లు విన్నివించినా ఇప్పటివరకూ విద్యుత్ కనెక్షన్‌ను సంబంధిత అధికారులు ఇవ్వలేదన్నారు.

మాలల మహా సింహగర్జనను జయప్రదం చేయండి

ఆదోని రూరల్: ఎమ్మిగనూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఈనెల 16న చేపట్టనున్న మాలల మహా సింహగర్జన సభను జయప్రదం చేయాలని మాలమహానాడు నాయకులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరామ్, ఆదోని డివిజన్ అధ్యక్షుడు బసాపురం, ఎల్లప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం వారు మండలంలోని మదిరె గ్రామంలో సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగానికి విరుద్ధంగా వర్గీకరణను చేయాలని తీర్పునిచ్చిన అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పునకు నిరసన చేపడతామన్నారు. మాలలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. నాయ కులు చెన్నబసవ, నరసింహ, కడప చెన్నప్ప పాల్గొన్నారు.

శ్మశాన వాటికను తొలగించండి

పెద్దకడబూరు : మంత్రాలయం మండలం చెట్నిహళ్లి గ్రామంలో దళితుల ఇళ్ల మధ్యలో ఉన్న శ్మశాన వాటికను తొలగించాలని జై భీమ్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆదామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దకడబూరు తహసీల్దార్ కార్యాలయంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ గీతాప్రియదర్శినికి వినతి పత్రం అందజేశారు.

కోసిగి: చెట్నిహళ్లి గ్రామంలో దళితుల ఇళ్ల మధ్యలో ఉన్న శ్మశాన వాటిక తొలగించాలని కోరుతూ మండల కేంద్రం కోసిగి తహసీల్దార్ కార్యాలయంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పందికోన రాజేష్ తహసీల్దార్ రుద్రగౌడకు వినతి పత్రం అందించారు. ఆయన వెంట ఆ సంఘం నాయకులు ఉన్నారు.

20న ‘విద్యుత్ మీటర్ రీడర్స్’ మహాసభ

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర ప్రథమ మహాసభ ఈనెల 20న విజయవాడలో నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా వర్కిల్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వీరేష్ తెలిపారు. శుక్రవారం సంఘ కార్యాలయం వద్ద మహాసభల పోస్టర్లను ఆ సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో చాలీచాలని వేతనాలతో మీటర్ రీడర్స్ పనిచేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్ల చేతిలో మోసపోతున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు, భీమేష్, చంద్రశేఖర్, ఉరుకుందు పాల్గొన్నారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



ఆదోనిలో దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు,ఉపాధ్యాయులు



ఎమ్మిగనూరులో పూలే అంబేడ్కర్ సొసైటీ ఆవరణలో నివాళులర్పిస్తున్న చిన్నారులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని సెయింట్ ఆంథోని ఉన్నత పాఠశాలలో ఏపీ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య రాష్ట్ర ముఖ్యమంత్రిగా, రెండు పర్యాయాలు కేంద్ర మంత్రిగా పని చేసి పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన మహా నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిర్మలమేరి, ప్రకాశమ్మ, శాంతి, మహాదేవి, మారెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు దామోదరం సంజీవయ్య

ఎమ్మిగనూరుటౌన్: నీతికి, నిజాయితీకి నిస్వార్థ సేవకే అంకితమైన ఆదర్శనీయుడు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని దళిత రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయుడు మాదన్న, నాయకులు భాస్కర్, ఆదెన్న అన్నారు. పలు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక హెచ్‌బీఎస్ కాలనీలో పూలే అంబేడ్కర్ సొసైటీ ఆవరణలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి జాతీయ సేవాస్తంభ్ జిల్లా ప్రతినిధి బైలుప్పుల షఫీవుల్లా పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు.

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో దామోదరం సంజీవయ్య జయంతిని ఎంపీడీఓ సుబ్బారాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఓ సత్యన్న, ఈఓపీఆర్‌డీ యోగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం హంపయ్య, స్కూల్ కమిటీ చైర్మన్ నరసింహులు సమక్షంలో విద్యార్థులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రీ సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు



రీసర్వే చార్టును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

గోనెగండ్ల: పొరపాట్లు లేకుండా పకడ్బందీగా భూముల రీ సర్వే చేపట్టాని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో పర్యటించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే చేసే సర్వే నెంబర్‌లోని రైతులకు ముందుగా సమాచారం అందించి, సర్వే చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో సేకరించిన తడి పొడి చెత్తలను వేరు చేసి వర్మికంపోస్టు తయారు చేయాలన్నారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమం కింద ర్యాలీ నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా హాజరవుతున్నారని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ నూర్జహాన్, తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ మణిమంజరి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, రీ సర్వే డీటీ శిరీష తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

ఎమ్మిగనూరురూరల్: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు ఇతర విషయాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కొత్త నంబర్ల నుంచి ఫోన్లు వచ్చినా, మీకు లాటరీ తగిలింది అని చెప్పినా, మేము పోలీసులమని కాల్స్ చేసినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై ఉద్యమం

ఎమ్మిగనూరురూరల్: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి, అర్బన్ కార్యదర్శి గోవర్ధనమ్మ, నాగలక్ష్మి, సీఐటీయూ తాలూకా కార్యదర్శి రాముడు అన్నారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ సఫర్నీసాబేగంకు ఈ నెల 17న అంగన్‌వాడీ సమస్యలపై నిర్వహించనున్న ధర్నాకు సంబంధించి నోటీసు ఇచ్చారు. ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాకు పెద్ద ఎత్తున అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు మల్లేశ్వరి, శకుంతల, రామలింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రత మనందరి బాధ్యత



మాట్లాడుతున్న సీడీపీఓ సఫరున్నిసా బేగం

గోనెగండ్ల : బాలికల భద్రత మనందరి బాధ్యత అని సీఐ గంగాధర్, సీడీపీఓ సఫరున్నిసా బేగం, ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆర్‌డీటీ ఆధ్వర్యంలో విద్యార్థునులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాలలు తమ హక్కులను, బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేయడం వలన అమ్మాయిలు మానసిక, శరీరక ఒత్తిడికి గురికావడం, ప్రసవ సమయంలో తల్లీబిడ్డ ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలియజేశారు. మండలాన్ని బాల్య వివాహాలు లేని మండలంగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీటీ మహిళా అభివృద్ధి విభాగం టీం లీడర్ ఆదినారాయణ, కమ్యూనిటి ఆర్గనైజర్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహలపై ఐసీడీఎస్ సీడీపీఓ సఫరున్నీసా బేగం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓ –2 మధుసుదన్‌రాజు, ఆర్‌డిటీ మహిళా మహిళాభివృద్ధి టీం లీడర్ ఆదినారాయణ, ఏరియాటీమ్ లీడర్ నాగసుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కవిత తదితరులు పాల్గొన్నారు.